భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

ప్రజాశక్తి - కడప : నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములపై జరిగిన 57 అక్రమ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దువ్వూరు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి. మునేశ్వరి దేవి ముద్దనూరులో ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో ప్రభుత్వ భూములపై 57 రిజిస్ట్రేషన్లను నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈ రిజిస్ట్రేషన్లపై స్థానిక జిల్లా రిజిస్ట్రార్ విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. సదరు నివేదికను పరిశీలించిన ముద్దనూరు మండలంలో 53, జమ్మలమడుగు మండలంలో ఒకటి, ఎర్రగుంట్ల మండలంలో 3, మొత్తం 57 నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించారు. 268 ఎపి రిజిస్ట్రేషన్ యాక్ట్, 1908 ప్రకారం ఈ 57 అక్రమ రిజిస్ట్రేషన్లను తక్షణమే రద్దు చేయాలని సంబంధిత తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

గ్రామీణ రోడ్ల మరమ్మతుకు రూ.71.15 కోట్లు విడుదల

976 పనులకు ఆమోదం

టెండర్ల నిర్వహణపై దృష్టి

జిల్లాలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. ఈమేరకు జిల్లా లోని కడప అసెంబ్లీ మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల పరిధిలో రూ.71.15 కోట్లతో సిసిరోడ్లు, డ్రెయినేజీలు, బి.టిరోడ్లు, డబ్ల్యుబిఎం రహదారి నిర్మాణాలకు ఆమోదం లభించింది. ఈమేరకు టెండర్లు నిర్వహణపై దృష్టి సారించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకుని పనులు చేపట్టే దిశగా పంచాయ తీరాజ్ డిపార్టుమెంట్ ముందుకు సాగుతోంది. 2025 మార్చి నాటికి గ్రామ సీమ ల్లో మౌలిక వసతులను అభివృద్ధి పరచాలనే ప్రభుత్వ ఆశయాన్ని పరుగులు తీయం చే దిశగా కదులుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని గ్రామీణ రహదారులకు కొత్తకళ రానుంది. ఇటీవల జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం రూ.75 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను అందజేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలను పరిశీలన అనంతరం మార్పు చేర్పుల అనంతరం రూ.71.15 కోట్లతో కూడిన పనులకు ఆమోదం తెలిపింది. ఈమేరకు జిల్లాలోని కడప అసెంబ్లీ మినహా మిగిలిన కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 976 పనులకు ఆమోదం తెలిపింది. ఫలితంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సిసిరోడ్లు, బి.టిరోడ్లు, డబ్ల్యుబిఎం రోడ్లు, డ్రెయినేజీలు, పాఠశాలలకు కాంపౌండ్‌వాల్స్ వంటి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయనుంది. ఇందులో జిల్లా గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల సాయం తో రూ.56.72 కోట్లతో 12.65 కి.మీ సిసిరోడ్లు, రూ.7.91 కోట్లతో 141 కి.మీ 10 బిటి రోడ్లు, రూ.3.62 కోట్లతో240 కి.మీ డబ్ల్యుబిఎం రోడ్లు, రూ.2.85 కోట్లతో 43 పాఠశాలలకు 28.25 కి.మీ మేర కాంపౌండ్‌వాల్స్ నిర్మాణ పనులు చేపట్టనుంది.

కేటాయింపులు ఇలా..

జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. కమలాపురం అసెంబ్లీ పరిధిలో రూ.14.92 కోట్లతో 265 పనులను చేపట్టనుంది. చెన్నూరు మండల పరిధిలోని గ్రామసీమల్లో రూ.2.22 కోట్లతో 23 పనులను 55.64 కి.మీ చేపట్టనుంది. చింతకొమ్మదిన్నె మండల పరిధిలో రూ.2.35 కోట్లతో 45 పనులను 58.92 కి.మీ నిర్మించనుంది. కమలాపురం మండల పరిధిలో రూ.2.85 కోట్లతో 46 పనులను 71.37 కి.మీ చేపట్టనుంది. పెండ్లిమర్రి మండల పరిధిలోని రూ.2.71 కోట్లతో 60 పనులను 67.81 కి.మీ చేపట్టనుంది. వల్లూరు మండల పరిధిలో రూ.2.13 కోట్లతో 42 పనులను 53.37 కి.మీ నిర్మించనుంది. వీరపునాయునిపల్లి మండల పరిధిలో రూ.2.63 కోట్లతో 49 పనులను 65.88 కి.మీ చేపట్టనుంది. మైదుకూరు అసెంబ్లీ పరిధిలోని చాపాడు, మైదుకూరు, దువ్వూరు, బి.మఠం, ఖాజీపేట మండలాల్లో రూ.182 పనులను రూ.8.47 కోట్లతో 182 పనులను 21.190 కి.మీ చేపట్టనుంది. బద్వేల్ అసెంబ్లీ పరిధిలోని అట్లూరు, బి.కోడూరు, బద్వేల్, గోపవరం, కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన మండ లాల పరిధిలో రూ.13.34 కోట్లతో 207 పనులను 266 కి.మీ మేర నిర్మించనున్నారు. పులివెందుల అసెంబ్లీ పరిధిలోని పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, లింగాల, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాలకు రూ.47 కోట్లతో 85 పనులను 107 కి.మీ మేర చేపట్టనుంది. జమ్మలమడుగు అసెంబ్లీ పరిధిలోని జమ్మలమడుగు, కొండాపురం, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, యర్రగుంట్ల మండలాలకు రూ.8.22 కోట్లతో 90 పనులను 16.454 కి.మీ నిర్మించ నుంది. ప్రొద్దుటూరు అసెంబ్లీ పరిధిలోని ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల లకు రూ.7కోట్లతో 70 పనులను 14.108 కి.మీ మేరకు రహదారులు, పాఠశాల ల కాంపౌండ్ వాల్స్ చేపట్టడానికి కసరత్తు చేస్తోంది.

2025 డిసెంబర్ నాటికి పూర్తి !

జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంగా టెండర్లు నిర్వహించడంలో నిమగ్నమైంది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ కుదుర్చుకున్న అనంతరం పనులకు శ్రీకారం చుట్టనుంది. 2025 డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించింది.

డ్రోన్ సేవలను విస్తృతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఆధునిక యుగంలో అన్ని రంగాల్లో డ్రోన్ సేవలు అత్యంత కీలకంగా మారనున్నాయని, వాటి సేవల సద్వినియోగం తోపాటు విస్తృతం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో వివిధ రంగాల్లో డ్రోన్ సేవల వినియోగం, అవశ్యకతపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరికరాలు అవసరం కూడా పెరిగిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రంగాల్లో కూడా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించేలా డ్రోన్ సేవల ఆవశ్యకత అవసరం అయిందన్నారు. భవిష్యత్తులో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రకాల సేవలను విస్తృతం చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటికే భూముల సర్వే, వ్యవసాయ అనుబంధ రంగాల్లో, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఫారెస్ట్రీ, మైన్స్, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల్లో ప్రభుత్వం డ్రోన్ సేవలను వినియోగిస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో పంటలపై పురుగు మందులు పిచికారీ చేయడంలో, పంచాయతీ, మున్సిపాలిటీల్లో పారిశుధ్యం నిర్వహణలో దోమలను అరికట్టేందుకు స్ప్రే చేయడం కోసం, అటవీశాఖలో సామాజిక అడవుల పెంపకంలో సీడ్ బాల్స్ చల్లడంలో, ల్యాండ్స్ సర్వే శాఖలో జియో ట్యాగ్ ద్వారా సర్వేలు చేయడం, మైన్స్ క్వారీలు, ఇసుక రీచ్‌లలో ఇసుక నిల్వలు ఎంత ఉన్నవి వంటి వాటిని డ్రోన్ల సాయం చేయాలన్నారు. మరెన్నో అధునాతన డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రభుత్వ, ప్రయివేట్ వ్యాపార రంగాల్లో సమర్థవంతంగా అర్థవంతమైన డేటాను అందిస్తారన్నారు. కాగా డ్రోన్ సేవలను అందించేందుకు సివిల్ ఏవియేషన్ నిబంధనలు, డ్రోన్ యాక్ట్‌లకు లోబడి అనుమతి పొందిన వారే డ్రోన్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డ్రోన్ నిర్వహణ ఆపరేటింగ్ కోసం శిక్షణ పొందిన వారికి మాత్రమే అవకాశం కల్పిస్తామని చెప్పారు. డ్రోన్ ఆపరేటింగ్‌లో శిక్షణ పొందిన వారిని డ్రోన్ పైలెట్‌గా లైసెన్స్ ఇస్తారన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం..జిల్లాలో వివిధ శాఖల్లో డ్రోన్ పైలెట్‌గా విధుల నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నామని అందుకోసం.. ఇంటర్మీడియట్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 21 వరకు కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్‌లో బయోడేటాతో నేరుగా సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ : 8712644805 (జిమ్మీ విజన్) కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమానికి ముందు డ్రోన్ల వినియోగం – ఉపయోగాలపై గరుడ, మరుత్ డ్రోన్ సంస్థల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, డ్వామా పీడీ విజయ కుమార్, కెఎంసి అదనపు కమిషనర్ రాకేష్, ఎన్విరాన్ మెంట్ ఆఫీసర్ సురేష్ కుమార్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ, రెవెన్యూ, సర్వే ల్యాండ్ శాఖల పాల్గొన్నారు.

విప్లవ కెరటం చే గువేరా : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రగిలే విప్లవ స్ఫూర్తి చేగువేరా అని, ఆయన స్ఫూర్తితో యువత కడప ఉక్కు కోసం ఉద్యమించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా కడపలో ఆర్‌టిసి బస్టాండ్ వద్ద సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ చేగువేరా యువతకు ఆదర్శమూర్తి అన్నారు. చేగువేరా ఫొటోను ప్రస్తుతం టీ షర్టుల పైన, టోపీల పైన ముద్రించుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన బొమ్మని ముద్రించుకోవడం కాదు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాలి అన్నారు .ఆయన చరిత్ర నేటి యువతకు తెలియజేయడం చాలా ఆదర్శమన్నారు. ఆయన స్ఫూర్తితో కడప ఉక్కు కోసం యువత కదలిరావాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత వలసలు వెళ్తున్నారన్నారు. రాయలసీమలో వలసల నివారణకు ఉక్కు పరిశ్రమ ఏకైక మార్గమన్నారు. పాలకులు ఎన్నికలలో ఇచ్చిన హామీలను మరిచారన్నారు. రాజకీయ అజెండాగా కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కడప ఉక్కు కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రాబోవు రోజులలో కడప ఉక్కు కోసం అన్ని పక్షాలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. కడప ఉక్కు కోసం యువత కదిలి రావాలని పిలుపునిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ నరసింహులు, నగర కన్వీనర్ విజయ్ పాల్గొన్నారు. **పిడిఎస్‌యు ఆధ్వర్యంలో..** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు, ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ ఆధ్వర్యంలో చేగువేరా 57వ వర్ధంతి నిర్వహించారు. బుధవారం కడప పిడిఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మాట్లాడుతూ చేగువేరా విద్యార్థి దశ నుంచి విప్లవభావాలకు ఆకర్షితుడై ప్రపంచ విప్లవకారులలో ప్రముఖుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్, పివైఎల్ జిల్లా నాయకుడు ముబారక్ బాషా, పిడిఎస్‌యు నగర నాయకులు పాల్గొన్నారు.

చేగువేరా వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న యువకుడు

యువకుల రక్తదానం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : 57వ చేగువేరా వర్ధంతి సందర్భంగా ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రి రక్త నిధి కేంద్రంలో యువకులు రక్తదానం చేశారు అనంతరం చేగువేరా చిత్రపటానికి ఘనంగా పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్, రామకృష్ణన్, నవీన్, శీను, బాబు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలకు ఎగ్జిబిషన్‌లు దోహదం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలు చిగురింపజేయడానికి 'స్పేస్ వీక్ -2024' లాంటి ఎగ్జిబిషన్‌లు ఎంతో దోహదపడుతాయని కలెకర్ శివశంకట్ లోతేటి పేర్కొన్నారు. నగర సమీపంలోని కెస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇస్రో, కెస్‌ఆర్ఎం విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగి ంపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా షార్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ బాబు, ఎపిపిబి జోనల్ ఆఫీరస్ ఎస్.ఎస్. మురళి, షార్ జిఎం వి. కృతి వాసన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలు శాస్త్ర సాంకేతికత పురోభివృద్ధి, పరిణామాలకు నాంది పలుకుతాయన్నారు. విద్యార్థుల్లో వెలిగే ప్రతి చిన్నపాటి ఐడియా కూడా వారి ఆలోచనా విధానం పరిశోధన వైపు అడుగులు వేయడం సాధ్యం అవుతుందన్నారు. వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ జ్ఞాపకలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కెఎస్‌ఆర్ఎం ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి, వైస్ ప్రిన్సిపల్ టి.ఎన్ ప్రసాద్, కల్చరల్ క్లబ్ కోఆర్డినేట్ డాక్టరు వీర శంకర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేట్ సురేష్ బాబు, కమిటీ మెంబెర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - సిద్ధవటం : భాకరాపేట సమీపాన ఉన్న 11వ పోలీస్ పటాలయంలో బుధవారం మహిళా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి 11వ పోలీస్ పటాలయం ఇన్‌ఛార్జి కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు పటాలంలో పోలీస్ అమరులైన కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అమరవీరుల త్యాగాలు మరువలేమని పేర్కొన్నారు. వారి కుటుంబ సమస్యల పరిష్కారమే మహిళా దర్బార్ పరిష్కార వేదికగా అమలు చేశామని ఆయన అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.విల్సన్, ఎస్ డి ప్రసాద్, మహిళా వైద్యాధికారి దివ్య రాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరూ అధైర్య పడొద్దు

ప్రజాశక్తి - కడప : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్య పడవద్దని కాంగ్రెస్ పార్టీ యువ నేత వెన్నపూస మధు రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నా వాటిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. పిసిసి చీఫ్ షర్మిల ఏ సమస్య వచ్చినా మనందరికీ అండగా, తోడుగా ఉంటారని తెలిపారు. ఎటువంటి విభేదాలు లేకుండా కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన దేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి, రాష్ట్రానికి వైయస్ షర్మిల రెడ్డి ముఖ్యమంత్రిగా అయ్యేవిధంగా అందరూ ఐకమత్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా మధు రెడ్డి సూచించారు.

మైలవరం కాలువకు మరమ్మతులు

ప్రజాశక్తి- కమలాపురం టౌన్

కమలాపురం వాసుల తాగు, సాగు నీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశాలతో నియోజక వర్గ రైతు అధ్యక్షులు చాపాటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మైలవరం దక్షిణ కాలువకు మరమ్మతులు ప్రారంభించారు. కమలాపురం చెరువుకు నీటి నింపడం వల్ల సుమారు 20 వేల జనాభా ఉన్న కమలాపురం పట్టణానికి తాగునీటి సమస్యతో పాటు, చుట్టుపక్కల గ్రామాలకి తాగునీరు, ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందని చాపాటి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కాల్వకు ఇరువైపులా మొక్కలు పెరగడం వల్ల కాలువలో నీటి ప్రవాహం వేగం మందగించడం, ఇరువైపులా నీటి చెమ్మ తగలడం వల్ల రైతులకు కూడా ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. మైలవరం దక్షిణ కాలువ అధికారులు స్పందించి కాల్వ ఇరువైపులా ఉన్న చెట్లను మొక్కలను తొలగించి కమలాపురం చెరువుకు త్వరగా నీరు చేరే విధంగా కాలువను ఆధునికరించాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఎల్లారెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు చిన్న సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కాల్వకు మరమ్మతు పనులు చేయిస్తున్న చాపాటి ప్రభాకర్‌రెడ్డి

ఉమ్మడి వనరులు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-అట్లూరు : గ్రామాలు పచ్చగా ఉండాలంటే ఉమ్మడి వనరులు అభివృద్ధి చెందాలని జిల్లా క్లస్టర్ కో–ఆర్డినేటర్ రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండల స్థాయి ఉమ్మడి అభివృద్ధి సమితి సమావేశం స్థానిక ఉపాధి కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి 25 గ్రామాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గ్రామం పచ్చగా ఉండాలంటే ఉమ్మడి వనరులైన కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, శ్మశానం అభివృద్ధి చెందాలన్నారు. కొండ గుట్టల్లో ఉపాధి పనులు నిర్వహించి గ్రామస్తుల జీవన విధానాన్ని మెరుగు పరచవచ్చన్నారు. కొండ, గుట్టలలో మొక్కలు నాటడం వల్ల అక్కడ మేఘాలు వర్షించి నీరు వాగులు, వంకల ద్వారా చెరువులకు వచ్చి చేరుతాయని పేర్కొన్నారు. ఇలా వచ్చి చేరిన నీరు వ్యవసాయానికి, పశువులకు, తాగడానికి ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎపిఒ, ఇసి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామోదయం, నగరోదయం

ప్రజాశక్తి - కడప : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వినూత్నంగా ఈనెల 10 నుంచి గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఆయా మండలాల కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జులతో గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాల నిర్వహణపై జెసి అదితి సింగ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రతి గురువారమూ మండల ప్రత్యేకధికారులు ఒక్కో గ్రామ పంచాయతీలో గ్రామోదయం, పట్టణాల్లో నగరోదయం పేరుతో గ్రామ సందర్శన చేయాలన్నారు. ఉదయం 7 గంటలలోపే ఆయా గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారులు సంబందిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆయా గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లతో గ్రామ సందర్శించాలని చెప్పారు. అందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఆర్థిక సమాజిక స్తితిగతులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయకుమార్, డిఆర్‌డి, హౌసింగ్, ఐసిడిఎస్ పీడీలు ఆనంద్ నాయక్, జయరాజ్, శ్రీలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాసరెడ్డి, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, డిఎఒ రాజ్యలక్ష్మి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

నీటి విడుదల సందర్భంగా మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్

15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తాం

పాపాఘ్ని నదికి నీటి విడుదలలో కలెక్టర్

ప్రజాశక్తి-వీరపునాయునిపల్లె

జిఎన్ఎస్ఎస్ అడవిచెర్ల పల్లె నుంచి పాపాఘ్ని నదికి నీటిని విడుదల చేయడం వల్ల 15 వేల ఎకరాలకు నీరందుతుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. కమలాపురం నియోజకవర్గంలోని వీరపునాయునిపల్లి మండలం జిఎన్ఎస్ఎస్ 36 కీమీ. పాయింట్ అడవిచెర్లపల్లి వద్ద నుండి పాపాగ్ని కి నీటిని విడుదల చేశారు. ముఖ్య అతిధులుగా కలెక్టర్ , కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, నాయకులు పుత్తా నరసింహ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవిచెర్లపల్లి వద్ద నుంచి 12 కిలో మీటర్ల పొడవునా మగిమేరు వంక ద్వారా నీటిని విడుదల చేసి పాపాగ్ని నీటిని పంపి అక్కడ నుంచి సమీపంలోని పలు ప్రాంతాలకు సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టు ఇచ్చే కార్యక్రమాన్ని కమలాపురం శాసనసభ్యులు ప్రణాళిక బద్ధంగా రూపకల్పన చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు తక్కువ కురిసిన కారణంగా కమలాపురం నియోజకవర్గంలో గ్రౌండు వాటర్ తగ్గిందని, తాగునీటి కూడా ఇబ్బంది వచ్చే పరిస్థితి సమయంలో తన తండ్రి సూచనల మేరకు ఇరిగేషన్ అధికారులతో చర్చించి నీటిని విడుదల చేశామన్నారు. ఈ నీరు 4 మండలాలకు కమలాపురం, వల్లూరు, పెండ్లిమర్రి, వి ఎన్ పల్లి మండ లాలకు ఆయకట్టు పెరిగే విధంగా గ్రౌండు వాటర్ రీఛార్జి చేశామన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ భాను శ్రీ, ఇరిగేషన్ ఎస్ఇలు మల్లికార్జునరెడ్డి, వెంకట్రామయ్య, తహశీల్దార్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-కాశినాయన : మండలంలోని అమగంపల్లె ఇటుకలపాడు వరికుంట్ల గ్రామాల్లోని సమస్యలపై బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్ బుధవారం విచారణ చేపట్టారు. కొంతమంది బాధితులు భూసమస్యపై ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసేందుకు వచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య అక్కింగుండ్ల శావిశెట్టిపల్లి గ్రామాల్లోని భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇక్కడ హైదరాబాదుకు చెందిన భూ కబ్జాదారుడైన శ్రీనివాసుల రెడ్డి వందల ఎకరాలు కలిగి పేదలను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని బినామీ పట్టాల పొంది పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లో రెవెన్యూ అధికారులకు లంచాలు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఆర్‌డిఒకు తెలియజేశారు. ఆయన స్పందించి వాటిపై త్వరలో విచారణ చేస్తానని తెలిపారు. ఆర్‌డిఒ వెంట పూర్వపు, ప్రస్తుతం తహశీల్దార్లు బాల నరసింహులు, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - కడప : విద్యార్థినుల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్త వహించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచించారు. బుధవారం అక్కాయపల్లెలోని బాల సదన్‌ను జడ్జి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. బాలసదన్‌లో ఉన్న విద్యార్థినులతో జడ్జి మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో బాలసదన్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాశినాయన తహశీల్దార్‌గా వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-కాశినాయన : మండల తహశీల్దార్‌గా వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన నూతన డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్‌తో కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే ఆర్ఐగా అమర్‌నాధరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయంలో కొత్త సిబ్బంది రావడంతో మండలంలోని భూ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ముఖ్యంగా అక్కింగుండ్ల, శావిశెట్టిపల్లె గ్రామాల్లోని ఆక్రమణకు గురైన భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

'పీస్' విద్యార్థులకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి - కడప అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా జాతీయ స్థాయి ఎంపికలు ఈనెల 6 నుంచి 8 వరకు తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వపి ంచారు. (అండర్ -14) కరాటేలో తమ పాఠశాల విద్యార్థి షేక్.ఇబ్రహీం (6వ తరగతి) గోల్డ్ మెడల్‌తో పాటు నేషనల్స్ టోర్నమెంట్‌కి ఎంపికయ్యారని స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ తెలిపారు. ఇంకా తమ పాఠశాలకు విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. నేషనల్ టోర్నమెంట్ నవంబర్ నెలలో మధ్యప్రదేశ్‌లో నిర్వహిస్తారని చెప్పారు. అందులో ఇబ్రహీం హాజరైతాడని పేర్కొన్నారు.

విద్యార్థులతో పీస్ పాఠశాల యాజమాన్యం

ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ ప్రకటించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. బుధవారం సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 11వ పిఆర్‌సిలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రివర్స్ పిఆర్‌సి ఇచ్చి తీవ్రంగా నష్టపరిచిందన్నారు. 12వ పిఆర్‌సికి కమిటీ వేశారే తప్ప అమలు చేయడంలో ఏమాత్రం చిత్తశుద్ధి ప్రదర్శించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉద్యోగులు ఓట్లు వేసి గెలిపి ంచుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. 12వ పిఆర్‌సి అమలు చేయడానికి ఆలస్యం అవుతు ండడం వల్ల మంత్రివర్గ సమావేశంలో దసరా కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30శాతం మధ్యంతర భృ ని ప్రటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అన్ని కార్యక్రమాలలోనూ తోడుగా ఉంటూ, సంపూర్ణమైన సహకారాన్ని అందిస్తారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సరెండర్ లీవ్ బిల్లులు పెట్టి 2 సంవత్సరాల అవుతున్నా ఇంతవరకు చెల్లించలేదని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులన్ని చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేంద్రగుత్తి గంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన 117 జిఒ వల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా నష్టపోయిందని చెప్పారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే 117 జిఒను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు పరచాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సి. సుదర్శన్ బాబు, కార్యదర్శులు కట్టా గంగాధర్, జయరాం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శివార్జున

ఉర్దూ పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ ఉపాధ్యాయ సర్దుబాటుకు నోచుకోని ఖాళీలను భర్తీ చేయాలని, రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) అధ్యక్షులు సయ్యద్ ముష్తాఖ్ హుసేన్, అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అలీమ్ కోరారు. బుధవారం వారు జెడి సర్వీసెసె పార్వతికి వినతి పత్రం అందజేశారు. పాఠశాలల అప్ గ్రేడ్ నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ఫైళ్లను పూర్తి చేయాలని పేర్కొనాన్రు. ఉర్దూ పాఠశాలలలో నియమించిన ఉర్దూయేతర ఉపాధ్యాయులను వెనక్కి పంపించాలని పేర్కొన్నారు.

ఎంపిడిఒగా పెనుగొండ లక్ష్మీదేవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - సిద్ధవటం

మైదుకూరు మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఒగా పెనుగొండ లక్ష్మీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఎఫ్ఎస్‌సి మండల అభివృద్ధిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.



టెట్ పరీక్షకు1528 మంది హాజరు

ప్రజాశక్తి- కడప అర్బన్

టెట్ పరీక్షకు 1528 మంది హాజరైనట్లు డిఇఒ అనురాధ తెలిపారు. బుధవారం 1834 మంది హాజరు కావాల్సి ఉండగా 1528 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 36 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న జెసి అదితి సింగ్

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూముల పరిశీలన

ప్రజాశక్తి - కొండాపురం

ఆదాని కంపెనీ ఏర్పాటు చేయనున్న వెయ్యి మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కె.బొమ్మెపల్లి రెవెన్యూ గ్రామం దొంతికోన వద్ద బుధవారం జెసి అదితి సింగ్ ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఆ భూముల వివరాలను మండల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, కొండాపురం రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఐటిఐలో ఘనంగా సరస్వతీ పూజ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీకందుల ఓబుల్‌రెడ్డి చారిటీస్ ఐటిఐలో బుధవారం సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. దసరా సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో కళాశాలలోని అన్ని ట్రేడులలో విద్యార్థులు పాల్గొని పరికరాలకు పూజలు చేశారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ప్రతి విద్యార్థి ఆయా రంగాల్లో ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది ప్రభాకర్ నాయుడు, చంద్రశేఖర్, ఉత్తమారెడ్డి, వెంకటరెడ్డి, అమర్నాథరెడ్డి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రజాశక్తి - ముద్దనూరు

మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఈనెల 11వరకు గడువు పొడిగించినట్లు బుధవారం ముద్దనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డబ్ల్యూ.విన్సెంట్ తెలిపారు. ముద్దనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్టేషన్ పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, సింహాద్రిపురం, చాపాడు, తొండూరు మండలాల కాంట్రాక్టర్లు, ప్రజలు గమనించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. దరఖాస్తులను ముద్దనూరు ఎక్సైజ్ స్టేషన్‌లో స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు డి.హరిప్రసాద్ శర్మ, పి.హరిప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయ దారులు వెన్నపూస లక్ష్మీరెడ్డి, లక్ష్మీనరసమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త మహేశ్వరరెడ్డి, శిరీష దంపతులు, ద్వారకనాథరెడ్డి, నాగేశ్వరమ్మ, శంకర్‌రెడ్డి, రమాదేవి, నాగేంద్రరెడ్డి, శివలీల దంపతులను పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతించారు. మూల నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామి పల్లకిలో సింహాద్రిపురం వీధుల్లో భక్తులకు శ్రీవారు అవతారంలో దర్శనమిచ్చారు.

పరామర్శకు సమయం లేదా..?

- వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పిఠాపురంలో దళిత బాలికను మానభంగం చేస్తే పరామర్శించడానికి కూడా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు సమయం లేదా అని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు ప్రశ్నించారు. బుధవారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురంలో రెండు రోజుల క్రితం 16ఏళ్ల ఒక దళిత బాలికను టిడిపికి చెందిన వ్యక్తి జాన్ ఆటోలో తీసుకువెళ్లి అత్యాచారం చేస్తే కనీసం పరామర్శించలేదన్నారు. నంద్యాలలో ముచ్చుమర్రిలో ఏడేళ్ల పాపను అత్యాచారం చేసి చంపేస్తే ఇప్పటికీ దిక్కులేదన్నారు. గత వారంలో పుంగనూరులో బాలికను కిడ్నాప్ చేసి చంపేస్తే కూడా మీరు ఏమీ మాట్లాడలేదు.. ఏమైంది మీ ప్రశ్నించే గొంతుక అన్నారు. స్టేజీల మీద నీతి కథలు చెప్పడం కాదు.. ఆచరణలో చేసి చూపాలి.. మీ విధానం చూస్తూ ఉంటే మాటలకే పరిమితం అయ్యారు తప్ప ఆచరణలో శూన్యమని విమర్శించారు. ప్రశ్నించడం మాని ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో మీరు ఎందుకు చెల్లరని పేర్కొన్నారు.

ఏఓకు వినతిపత్రమిస్తున్న రైతు సంఘం నాయకులు

యూరియాను ప్రభుత్వమే సరఫరా చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని మండలాల్లో రైతులకు అవసరమైన యూరియా, రసాయనిక ఎరువులను ప్రభుత్వమే ప్రతి రైతుకు సరసమైన ధరకు అమ్మాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. బుధవారం మైదుకూరు రైతు సేవా సమితి నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు చొక్కం సంజీవ రాయుడు ఆధ్వర్యంలో మైదుకూరు ఎడి కార్యాలయంలోని ఏఓ సృజన కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రయివేట్ వ్యాపారులు రైతుకు అధిక ధరకు యురియాను అమ్ముతున్నారని తెలిపారు. రామ్మోహన్, శ్రీనివాసులు, సుబ్బా రాయుడు, గోశెట్టి రాఘవ, మూలే రామాంజనేయరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు

I.A.No. 95/2024

I.P.No. 53/2016

మురికి మల్లికార్జునరావు, S/o వెంకటేశ్వర్లు, హిందూ, 64 సం॥లు, ప్లాట్ నెం.401, వైఎమ్ఆర్ కాలని, ప్రొద్దుటూరు. ...పిటిషనర్/పిటిషనర్

Vs

4. ప్రొద్దుటూరు దస్తగిరమ్మ, W/o పెద్ద నరసింహులు, 68సం॥లు,
5. ప్రొద్దుటూరు చంద్రయ్య, S/o నరసింహులు, 55 సం॥లు,
6. ప్రొద్దుటూరు జయసింహ, S/o పెద్ద నరసింహులు, 52సం॥లు,
7. ప్రొద్దుటూరుదస్తగిరి, S/o పెద్దనరసింహులు, 50 సం॥లు, సాకిన్ అందరూ పాండురంగస్వామి దేవాలయం వీధి, మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు.

...రెస్పాండెంట్స్ 4 to7

నోటీసు

పై నెంబరు I.P.53/2016 లో 1వ రెస్పాండెంట్ ప్రొద్దుటూరు పెద్ద నరసింహులు గారు చనిపోయినందున వారసులుగా మిమ్ములను చేర్చుకోరుచూ I.A.No.95/2024 వ పిటిషన్‌ను దాఖలు చేసివున్నారు. అట్టి పిటిషన్ యందు మీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల 24.10.2024వ తేదీన ఉ.10.30 గం.లకు స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెయును. లేనిచో మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 24.10.2024

//By Order of the Court//

వి.హరిప్రసాద్

అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కడప

యం.వి.ఓ.పి.నెం. 368/2022

1. బేపారి అమీర్ బాష మరియు ఇతరులు ...పిటిషనర్లు

Vs

1. ఎర్రనాగు రాగరంజన్ రెడ్డి, తండ్రి వై.పి. పుల్లారెడ్డి, వయస్సు 36 సం॥లు, హిందూ, డ్రైవర్ ఆఫ్ చవర్లెట్ కార్ నెం. ఏపి16-సిజె-1242, నివాసం డోర్ నెం. 4/219, ఈశ్వర్ రెడ్డి నగర్, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా. ...రెస్పాండెంట్ నెం.1

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై తెలిపిన పిటిషనర్లు రాజశ్రీ కడప 1వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు బేపారి మహమ్మద్ గౌస్ రోడ్డు ప్రమాదములో చనిపోయి నందున నష్టపరిహారం కోరుతూ 1వ ప్రతివాది అయిన మీ పైన మరియు ఇతరులపైన యం.వి.ఓ.పి. నెం. 368/ 2022 అను కేసును దాఖలు చేసివున్నారు. సదరు కేసున నందు 1వ ప్రతివాది అయిన మీకు రాజశ్రీ కోర్టు వారు నోటీసు జారీ చేయడం జరిగినది. కావున మీరు 16-10-2024వ తేది ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు హాజరు కావలెను, లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

తేది: 17/8/2023

// బై ఆర్డర్ ఆఫ్ ది హానరబుల్ కోర్టు//

డి. రెడ్డెయ్య

పిటిషనర్ల తరపు న్యాయవాది, కడప.

సెల్ నెం. 9848270157..

మరుగుదొడ్లు లేక ప్రయాణికులకు ఇక్కట్లు

పాత మరుగుదొడ్లను తొలగించిన ప్రాంతం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె కొత్త ఆర్టీసీ బస్టాండు పనుల్లో భాగంగా గతంలో ఉన్న పాత మరుగుదొడ్లను తొలగించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వేంపల్లెలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించేందుకు గత ప్రభుత్వం పాత బస్టాండ్‌ను తొలగించి, అదే ప్రాంతంలో దాదాపు రూ.3కోట్లతో కొత్త బస్టాండ్ నిర్మిస్తున్నారు. ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. పాత బస్టాండ్ కూల్చి వేసినప్పటి నుంచి ప్రొద్దుటూరు, కడప, పులివెందుల, రాయచోటి ప్రాంతాలకు వెళ్లే బస్సులు రోడ్డుపైనే నిలుపుతున్నారు. బస్టాండు ఆవరణలో మరుగుదొడ్లు ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండేది. అయితే బస్సు రాకపోకల కోసం రోడ్డును వేసేందుకు ఐదేళ్ల బస్టాండ్ ఆవరణలో ఉన్న పాత మరుగుదొడ్లను పూర్తిగా తొలగించారు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే మహిళా ప్రయాణికులతోపాటు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. అలాంటి ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో దూర ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పనులు కూడా అసంపూర్తిగా ఉండడంతో మద్యం బాబులు అక్కడే హల్‌చల్ చేస్తున్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసిన తర్వాత పాత ఉన్న మరుగుదొడ్లను తొలగించి ఉంటే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండేదని పలువురు అంటున్నారు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి మహిళా ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసిన తర్వాత ఉన్న మరుగుదొడ్లను తొలగించి ఉంటే బాగుండేది. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. బస్టాండ్ ప్రాంతానికి ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. నూతన బస్టాండ్ పనులు కూడా వెంటనే పూర్తి చేసి బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- గాలి హరి ప్రసాద్, వార్డు మెంబరు, వేంపల్లె

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా..: డాక్టర్ కవితా ప్రసన్న

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెబుతున్నా.. మానసిక ఆరోగ్యం లేకుండా అసలు ఆరోగ్యమే లేదని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.కవితా ప్రసన్న పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. మానసిక వత్తిడి, ఆందోళన వంటి సమస్యల వల్ల చిన్న వయసులోనే అధిక రక్తపోటు, మధుమేహం, గుండెపోటు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. గణాంకాల మేరకు మనదేశ జనాభాలో 15శాతం మానసిక ఆరోగ్యంతో బాధపడుతున్నారన్నారు. 2017గణాంకాల మేరకు మన దేశంలో ప్రతి ఏడుగురు విద్యార్థుల్లో ఒకరికి తేలికపాటి నుంచి తీవ్రమైన మానసిక రుగ్మతలు ఉన్నాయన్నారు. అందువల్ల ఈ వ్యాధులపై అవగాహన పెంచుకుని వైద్యం పొందాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక రుగ్మతలపై అవగాహన ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రతి సంవత్సరం ఒక నేపథ్యం (థీమ్) నిర్ణయిస్తారన్నారు. ఈ సంవత్సరం థీమ్ 'పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యాన్ని ప్రధానం'గా చేశారన్నారు. ఇది చాలా ముఖ్యమైన థీమ్.. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా 60శాతం జనాభా ఉద్యోగులు ఉన్నారు. వారిలో ప్రతి ఏటా 3వందల మిలియన్ల మంది ఆందోళన, 280 మిలియన్ల మంది కుంగుబాటు (డిప్రెషన్) వంటి వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. దాదాపు 7లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. తద్వారా ఉద్యోగుల ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

ఉద్యోగులతోపాటు ప్రజల్లో కూడా మానసిక వ్యాధుల నిర్మూలన పట్ల అవగాహన పెరగాలన్నారు. నిరాశ, ఆందోళన వంటి సమస్యలను మొగ్గ దశలోనే గుర్తించగలిగితే వాటి నివారణ సులభతరమన్నారు. ఖచ్చితమైన నిద్ర సమయం పాటించాలన్నారు. మత్తుపానీయాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమం తప్పని యోగా, మెడిటేషన్ చేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. మానసికస్థైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. ఇష్టమైన సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి కళల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఇలాంటి చర్యల ద్వారా మానసిక సమస్యలను తగ్గించుకోవచ్చని డాక్టర్ ఎస్.కవితా ప్రసన్న సూచించారు.

రైల్వే మార్గంపై సిఎంకు బహిరంగ లేఖ

ప్రజాశక్తి - వేంపల్లె

కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వేలైన్ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి లేఖ రాశారు. ఆ లేఖను బుధవారం తులసిరెడ్డి మెయిల్ చేశారు. రాయలసీమ ప్రాంత రైతులు, వినియోగదారులు, అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధికి 2008-09 రైల్వే బడ్జెట్‌లో కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలుమార్గం మంజూరైందని లేఖలో తెలిపారు. రైలు మార్గం పొడవు 255.40 కిలోమీటర్లు. ఇందులో 205 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో, 50 కిలో మీటర్లు కర్నాటక రాష్ట్రంలోకి ఉందన్నారు. నిధులలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించే షరతులతో మంజూరైందని తెలిపారు. 2008-09 అంచనాల మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.3,038 కోట్లుతో 2010 సెప్టెంబర్‌లో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారని తెలిపారు. నాలుగు దశల్లో ప్రాజెక్టు పని పూర్తి చేయాలని నిబంధనలున్నాయన్నారు. మొదటి దశలో కడప నుండి పెండ్లిమర్రి వరకు, రెండవ దశలో పెండ్లిమర్రి నుండి లక్కిరెడ్డిపల్లె-రాయచోటి-వాల్మీకిపురం-వాయల్పాడు- మదనపల్లె వరకు, మూడవ దశలో మదనపల్లె నుండి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు అయిన ముల్బాగల్ వరకు, నాల్గవ దశలో కర్ణాటకలోని ముల్బాగల్ నుండి కోలార్ వరకు నిర్మాణం పూర్తయ్యేలా రూపకల్పన జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ నిధులు వెంటనే చెల్లించి రైల్వే శాఖ పనులు పునఃప్రారంభించేలా కృషి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని తులసిరెడ్డి కోరారు.

అధికారుల సూచనలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - వేముల

రైతులకు సూచనలిస్తున్న ఎఒ చెన్నారెడ్డి

పంటల సాగు మొదలుకొని పూర్తయ్యేవరకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకొని అధిక దిగుబడి సాధించాలని ఎఒ చెన్నారెడ్డి కోరారు. వేముల రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం ఆయన క్షేత్ర సందర్శన, పొలాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడిఎ ప్రభాకర్‌రెడ్డి, ఎఒ చెన్నారెడ్డి నిర్వహించారు. స్థానిక రైతులతో కలిసి పొలాలను పరిశీలించిన అనంతరం వారు రైతుల సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మహిళా రైతు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలన్నారు. ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది హారిక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** పచ్చి మిరపలో రసం పీల్చు పురుగు నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. బొందలకుంట గ్రామంలో బుధవారం ఎఒ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసం పీల్చు పురుగు ఉధృతిని అరికట్టేందుకు పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పూత దశలోనే కలుపు మొక్కలు తీసి కాల్చి వేయాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.రామసుధ, రమణయ్య, ముని భూపాలుడు, శైలజ, శ్రీదేవి, యమున, రైతులు పాల్గొన్నారు. **చాపాడు :** సాగుచేసిన పంటలకు చీడపీడలు సోకగానే పురుగుమందులు పిచికారీ చేసి పంటను కాపాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. సిద్ధారెడ్డిపల్లి, చియ్యపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ హజరత్‌రెడ్డి, చియ్యపాడు సర్పంచ్ శివప్రసాద్, గ్రామపెద్దలు సుబ్బారెడ్డి, వీరారెడ్డి, రైతులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం మహదేవ పల్లి రైతు సేవ కేంద్ర పరిధిలోని గంగారపు వాండ్లపల్లిలో మల్చింగ్ ఆధారంగా మిరప పంట సాగు చేస్తున్న పొలాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఒ నవంత్ బాబు, ఉద్యాన సహాయకురాలు శివ లలిత, పశు వైద్య సహాయకురాలు చేతన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : రైతులకు సూచనలిస్తున్న ఎఒ మ్యాగీ

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్, అధ్యక్షుడు జి.దాసు కోరారు. ఆ మేరకు వారు బుధవారం సూపరింటెండెంట్ రఫిక్ పాషాకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు ప్రతి నెల కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెల 5లోపు జీతాలు ఇస్తామని చెప్పి కాంట్రాక్టర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. నెలలో కొన్నిరోజుల జీతాలు పెండింగ్ పెడు తూ మూడు నెలల జీతాలు ఇచ్చి మిగతా జీతాలు బ్యాలెన్స్ పెడుతున్నారన్నారు. వర్కర్లపై దౌర్జన్యం ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్ పీరాపై కఠిన చర్యలు తీసుకొని, వెంటనే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్యలను 14 రోజుల్లో పరిష్కరించకపోతే ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు, మున్సిపల్ యూనియన్ నాయకులు శేఖర్, స్వామి, భీమా, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత వల్ల ఆరోగ్యంగా ఉంటామని కమలా పురం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్షుమయ్య సూచించారు. స్థానిక ఎస్సీ గిరికాలనీలో బుధవారం పిహెచ్‌సి వైద్యాధికారి కరిష్మా ఆధ్వర్యంలో ఫీవర్, లార్వా సర్వే నిర్వహించారు. సర్వే కార్యక్రమాన్ని మలేరియా అధికారి లక్షుమయ్య తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో పరిసరాల శుభ్రత లోపించిందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ జాసన్‌తో మాట్లాడి జ్వరాలు వచ్చిన నలుగురు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి సూపర్‌వైజర్ శోభా కుమారి, సిబ్బంది లక్ష్మీదేవి, వెంకటరవణమ్మ, ఆశా కార్యకర్తలు నీలవేణి, సంధ్య, పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** మేజర్ పంచాయతీ సింహాద్రిపురంలో శానిటేషన్‌పై ప్రత్యేకదృష్టి సారించి పరిష్కరిస్తామని పంచాయతీ ఇఒ వెంకటరాముడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన శానిటేషన్ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

అంగన్వాడీలపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జమ్మలమడుగు ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు భాగ్య లక్ష్మి, లక్ష్మీదేవి కోరారు. ఆ మేరకు వారు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు యాప్‌ల పేరుతో పని భారాన్ని పెంచారన్నారు. వెంటనే అన్ని యాప్‌లను కలిపి ఒక్కటిగా చేయాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్ల పట్ల అధికారుల వేధింపులు ఎక్కువ య్యాయని, తక్షణం వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల ప్రాజెక్టు సమావేశం జరపాలని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను విడుదల చేయాలని కోరారు. ఫేస్ యాప్‌ను తక్షణం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు అనసూయ, అరుణ, ప్రభావతి, మస్తానమ్మ పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు నియోజకవర్గ పరిధిలో రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మైదుకూరు మున్సిపల్ కార్యాలయంలో బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్, మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరసింహలుతో కలిసి డీలర్ల సమావేశం నిర్వహించారు. గొడౌన్ నుంచి పంపే బియ్యం బస్తాలు తూకాలు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. పాత డీలర్ల వద్ద ఉన్న బియ్యం నిల్వలను నూతన డీలర్లకు తప్పకుండా అందివ్వాలన్నారు. పాత డీలర్లు స్పందించకపోతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అన్ని రకాల నిత్యావసర సరుకులను సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

డిసిసిబిని ప్రారంభించిన ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని మల్లెపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన డిసిసి బ్యాంకును బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో డిసిసి బ్యాంకు ఏర్పాటు కావడం చాలా సంతోషకరమన్నారు. రైతులకు తక్కువ వడ్డీతో పంట రుణాలిస్తూ, ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిసిసి బ్యాంక్ సిఇఒ రాజమణి, టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, ముడమాల పోల్‌రెడ్డి, పూజ శివయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు సన్నపురి శ్రీను, సుధాకర్, మస్తాన్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే.. మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బుధవారం దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు కృష్ణమూర్తి, యాదళ్ల వెంకటసుబ్బయ్య, సుంకు నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు సురేంద్ర, శేషయ్య, సురేష్, నాగేశ్వరరావు, టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

'ఆది'ని విమర్శించే నైతిక హక్కు పిఆర్‌కు లేదు

- టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చేసే వ్యక్తిని విమర్శిస్తే కోపం రాదా అని ప్రశ్నించారు. కోపంలో రెండు మాటలు మాట్లాడితే దాన్ని ఆసరా చేసుకుని విమర్శించడం తగదన్నారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో అన్న క్యాంటీన్ల ఏర్పాటు కనబడడం లేదా అన్నారు. నియోజకవర్గానికి మొదటి దశలో రూ.16 కోట్లు అభివృద్ధి పనులు తెచ్చినవి కనబడడం లేవా అని ప్రశ్నించారు. మూడు నెలల్లో మూడుసార్లు ఉచిత వైద్య శిబిరం, జాబ్‌మేళా నిర్వహించి నియోజక వర్గానికి అన్ని విధాలా అండగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వర్‌రెడ్డి, గోన పురుషోత్తంరెడ్డి, పొన్నతోట శ్రీను, జయ చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వంగా సాగింది. పులివెందుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1997-99 సంవత్సరంలో చదివిన విద్యార్థులు బుధవారం కదిరి రోడ్డు సమీపంలో ఉన్న విజయ గార్డెన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు ప్రిన్సిపల్ అంకిరెడ్డి, అధ్యాపకులైన కృష్ణయ్య, సుబ్బరాయుడు, నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపల్ అంకిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. 25ఏళ్ల తర్వాత అప్పటి విద్యార్థులు ఒకే చోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్ నాయుడు, సురేష్‌రెడ్డి, ప్రతాప్, సురేంద్ర, ప్రసాద్, సూర్యనారాయణ, రమేష్, సుధాకర్, నాగమణి, ప్రమోద, సునీత, అమరావతి, ప్రశాంతి, శకుంతల, అరుణ దీప, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముద్దనూరు

గుండి నాగేంద్ర

ముద్దనూరు-కొండాపురం రైలు మార్గంలోని రైలు పట్టాలపై బుధవారం గుండి నాగేంద్ర (22) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్ర గుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దనూరులోని చింతకుంట గ్రామానికి చెందిన గుండి నాగేంద్ర డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాపాఘ్ని నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు సిఐ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున వేంపల్లె గ్రామ సమీపంలో ఉన్న పాపాఘ్ని నది నుండి లారీ, రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుడడంతో సిఐ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వీటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సిఐ సురేష్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులతోపాటు జరిమానా విధిస్తామని సిఐ హెచ్చరించారు.

పలు చోరీల కేసుల్లో నిందితుడు అరెస్టు

- 135 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని చిలకల బావి సమీపంలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న షేక్. అక్బర్ ఆలీ అనే దొంగను పోలీసులు పట్టుకున్నట్లు ఇన్‌ఛార్జి డిఎస్‌పి రమాకాంత్ పేర్కొన్నారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడు డిగ్రీ వరకు చదువుకుని ఎలక్ట్రీషన్ పనులకు వెళ్తూ అందులో వచ్చిన సంపాదన తన చెడు అలవాట్లకు సరిపోక దొంగతనాల వైపు వెళ్లాడని తెలిపారు. ఇళ్లల్లో దొంగతనాలు చేస్తూ, ఒంటరిగా ఉన్న ఆడవారి మెడలోని బంగారు చైన్లను లాక్కొని వెళ్తూ ఇలా వివిధ రకాల నేరాలకు పాల్పడ్డారని చెప్పారు. అతనిపై ఇప్పటికే కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు, కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో 3 కేసులు, కడప తాలూకా పోలీస్ స్టేషన్ లో 4 కేసులు, చిన్నచౌకు పోలీస్ స్టేషన్‌లో 2 కేసులు, చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో కేసు, వల్లూరు పోలీస్ స్టేషన్‌లో 1 కేసు, మొత్తం 14 నమోదు అయినట్లు పేర్కొన్నారు. మొత్తం రెండు కేసులలోని రూ.6.5 లక్షల విలువైన, సుమారు 135 గ్రాముల బరువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని ముద్దాయిను అరెస్టు చేసినట్టుగా తెలిపారు. కేసులో సమర్థంగా పనిచేసిన ఎస్ఐ రవి కుమార్, తన సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వేణు గోపాల్, శివ కుమార్, పోలీసులు ఖాదర్ హుస్సేన్, ఓబులేసు, రంతు బాష, సుధాకర్, నాగరాజు, గోపాల్, ఉమా మహేశ్వరీని అభినందించారు.